క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని మర్కస్ మసీదులో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పూలకొట్టు జాను ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత మర్కస్ మసీదులో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్‌సుభానీ, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, షేక్ సైదావలి, ఆదాం షఫీ, గోల్డ్ జానీ, వలి, కొత్వాల్ సైదా, కుందురు తిరుపతిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా ఏలిషా



దాచేపల్లి : పాస్టర్స్ ఫెలోషిప్ మండల శాఖ అధ్యక్షుడిగా ఎం ఏలిషా నియమితులైయ్యారు. మండలంలోని గామాలపాడులోని చర్చిలో బుధవారం పాస్టర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడిగా జోసెఫ్, గౌరవ అధ్యక్షుడిగా మల్ల ఇస్సాక్, కార్యదర్శిగా కొమ్ము జాకబ్, సహాయ కార్యదర్శిగా కుక్కమూడి థామస్, కోశాధికారిగా డేవిడ్‌రాజు, సలహాదారుడిగా జానయ్యను ఎన్నుకున్నారు. పాస్టర్స్ సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఏలిషా చెప్పారు

వాహనదారులకు కౌన్సెలింగ్



రెంటచింతల: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనదారులకు స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందని ఏఎస్ఐ హనుమంతురావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓవర్‌లోడ్, హెల్మెట్‌లే కుండా వాహనాలను నడిపిన, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న, మైనర్లు వాహనాలను నడిపిన వారి నుంచి సడలించిన నియమనిబంధనలమేరకు రూ.1000 నుంచి రూ.2వేల వరకు అపరాధ రుసుం వసూలు చేయడంతోపాటు, 10 రోజుల నుంచి నెలవరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

మదర్‌థెరిస్సా సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం



మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో కసిరెడ్డి శాంతిరెడ్డి, చిన్నపరెడ్డి తలిదండ్రులు స్వర్గీయ కసిరెడ్డి వీరారెడ్డి జ్ఞానమ్మల జ్ఞాపకార్థం కుష్టురోగులకు బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కసిరెడ్డి శాంతిరెడ్డి, సీనియర్ న్యాయవాది సీహెచ్ నాగిరెడ్డి లు మాట్లాడుతూ అనాథలకు సేవా చేయడంలో మదర్ థెరిస్సా సేవాసమితి సభ్యులు ముందంజలో ఉన్నారన్నారు. ముందుగా సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వడ్డన చేశారు. కాలనీ అవసరాలు తెలుసుకుని కుర్చీలు బహుమతి చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కిరెడ్డి మర్రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, తుమ్మా మర్రెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, బుబ్బా నాగిరెడ్డి, కొణతం ఈశ్వరరెడ్డి, బ్రహ్మారెడ్డి, గోవిందు, మోరా భాస్కర్‌రెడ్డి, డా'' సుధా తదితరులున్నారు.

జగనన్న భూ హక్కు-భూ రక్ష సర్వే పరిశీలన

దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న భూ హక్కు-భూ రక్ష సర్వే పనులను గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య బుధవారం పరిశీలించారు. ఈ సర్వేలో భాగంగా 1434 ఎకరాల్లో సర్వే చేశారు. సర్వే చేసిన భూముల్లో 350 సరిహద్దు రాళ్లు పాతారు. ముత్యాలంపాడు, అలుగుమల్లెపాడు గ్రామాల్లో ఈ సర్వే వేగవంతంగా ముగిసిందని, సర్వే చేసిన భూముల్లో రాళ్లు పాతామని ఆర్డీఓ అద్దయ్య చెప్పారు. రైతుల పొలాలకు సరిహద్దు వివాదాలు లేకుండా సర్వేను సమర్థవంతంగా నిర్వహించామని, సర్వే చేసిన రైతులకు త్వరలో పాసుపుస్తకాలు అందిస్తామని ఆయన వెల్లడించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ దొప్పలపూడి మేరికనకం, డిఐ జయరాజు, సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయం సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.

జగనన్న ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

పిడుగురాళ్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల కోసం ప్రతి ఒక్కరు పని చేద్దామని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని 33వార్డుల్లో 17 సచివాలయ పరిధిల్లో ఆయా కౌన్సిలర్ల అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 32వ వార్డులో వార్డు ఇన్‌చార్జి ఎండీ అలీమ్, కౌన్సిలర్ షేక్ జాని ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జనగన్న కార్యక్రమాన్ని నిర్వహించి వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 17, 18 వార్డుల్లో ఇన్‌చార్జి గొట్టిముక్కల పవన్‌రెడ్డి, కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 23వ వార్డు కౌన్సిలర్ శ్రీ రంగ రజని, 4 వార్డుల్లో కౌన్సిలర్లు పోలు శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి వెన్నా రాజశేఖర్, పోలు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. 27వ వార్డులో కౌన్సిలర్లు అన్నెం పద్మావతి బంగారు రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌కు విశేష స్పందన

దాచేపల్లి : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. నగర పంచాయతీతో పాటుగా మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు మేలుకరంగా ఉన్నాయని లబ్ధిదారులు చెప్పారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, సర్పంచ్‌లు కూనం నాగిరెడ్డి, వినుకొండ కోటేశ్వరరావు, బొడ్డు నరసింహరావు, అనుముల అంజిరెడ్డి తండా బుడేసా పాల్గొన్నారు.

దుర్గిలో...

దుర్గి: మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ పార్టీ అందజేసిన స్టిక్కర్లను అంటించారు. రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలుపరచి అభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇటువంటి పథకాలు అమలుపరచని విషయాన్ని గుర్తు చేశారు. నేరుగా లబ్ధిదారులు ఖాతాలల్లో డబ్బులు జమవుతున్న విధానం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లబోతు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, సచివాలయ కన్వీనర్ రాయల మధుబాబు, నాగుల్ మీరా పలువురు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో కౌన్సిలర్, వార్డు నాయకులు



జగనన్న మా భవిష్యత్తు.. మా నమ్మకం జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ షేక్ సహినియత్

మాచర్లలో...

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని పట్టణంలో 31వ వార్డులో కౌన్సిలర్ షేక్ సహినియత్ బేగం, 16 సచివాలయాల కన్వీనర్ కరిముల్లా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కరిముల్లా, సచివాలయ కన్వీనర్లు కందుకూరి రత్నరాజు, శ్రీనివాసరావు, నట్టువ రాధాకృష్ణ, కోకా సుబ్బారావుల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఇంటింటికీ తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాబోయే రోజుల్లోనూ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ మళ్లీ జగనన్నను సీఎం చేయాలన్నారు. ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, రంగా చెన్నయ్య, ఇటుకల బట్టి శంకర్, మద్దికర పాపిరెడ్డి, రమణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షేమాన్ని చూచి జగనన్నకు మద్దతివ్వండి

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు అంతా టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని గుర్తు చేస్తూ అవన్నీ మీకు సంతృప్తినిచ్చాయా.. అని ప్రజలను ప్రశ్నలు అడిగారు. అంతా కూడా భవిష్యత్తులో కూడా ఇలాగే సంక్షేమ పథకాలు అందాలని ఆకాంక్ష వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో కూడా జగనన్నకే మద్దతు తెలుపుతామని ప్రజలు స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామ ప్రధాన రహదారిని రూ.75 లక్షలతో ప్రభుత్వం నిర్మాణం చేయించిందని, అలాగే గ్రామ పరిధిలో ఉన్న మూడు ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కింద అభివృద్ధి చేసిందని, ఎప్పుడూ మంచినీటి ఎద్దడి ఎదుర్కొనే గ్రామంలో 20 మంచినీటి బోర్లు వేయడంతో పాటు ఆరు మినీ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, డిపెప్ పథకం కింద టాయ్‌లెట్స్ నిర్మాణం జరిగిందని రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయం, అలాగే రూ.20 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ. 18 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్, ఆరు సీసీ రోడ్లు నిర్మాణం జరిగాయని, ఇలా కోట్లాది రూపాయల నిధులతో గ్రామం అభివృద్ధి చెందిన విధానాన్ని కూడా కార్యక్రమాల్లో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు గాడిపర్తి పూర్ణయ్య, ఉన్నం ఆదిశేషగిరి రావు, వెన్నపూసల బుల్లెబ్బాయి, మాచర్ల ఏడుకొండలు తదితర నాయకులు ప్రజలకు వివరించారు. రెండు రోజులు ఆలస్యంగా కార్యక్రమం ప్రారంభించినా ప్రస్తుతం చైతన్యవంతంగా కొనసాగుతోంది. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో కూడా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. ఒప్పిచర్లలో సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు, మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్యల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతోంది. అలాగే కారెంపూడిలో సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీటీసీలు గుండెబోయిన శివ, అంతరగడ్డ ఏసోబు, బొమ్మిన సావిత్రి, షేక్ ఆరీఫ్, వేముల లింగయ్య తదితరులు పర్యవేక్షణలో కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ప్రతి గడపలో ప్రజల మద్దతు లభిస్తోంది.



పేటసన్నెగండ్లలో ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం



కారెంపూడిలో జెడ్పీటీసీ షేక్ షఫీ, షేక్ అక్బర్ పార్టీ నాయకులు

రెంటచింతల ఉప సర్పంచ్ రాజీనామా

రెంటచింతల: గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందం మేరకు మేజర్ పంచాయతీ రెంటచింతల ఉప సర్పంచ్ ఏరువ ప్రమీలరాణి విజయ భాస్కర్‌రెడ్డి రాజీనామ చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విప్,పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తమ కుటుంబం పై చూపిన ప్రేమ,నమ్మకం మేరకు రెండు సంత్సరాల పదవికాలం అనంతరం రాజీనామ చేస్తున్నామన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

గురజాల : రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పారదర్శకంగా అర్హులకు పథకాలు మంజూరు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కె అన్నారావు, కౌన్సిలర్ కుక్కమూడి అనిల్‌కుమార్‌లు అన్నారు. బుధవారం జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. కార్యక్రమాల్లో జక్కా రమణ, మహంకాళీ యశోదదుర్గా, దేవండ్ల నీలంరాజు, కనకం ఆదినారాయణ దత్తు, కర్రా గిరిబాబు, కందిమళ్ల శ్రీనివాసరావు, చలవాది నారాయణ, షేక్ పీర్ అహ్మద్, తదితరులున్నారు.

బోరు బావిని ప్రారంభించిన ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి ఎస్సీ కాలనీలో ప్రజలెదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కాలనీ ప్రజలెదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు బావిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బోరును ప్రారంభించి ఎస్సీ కాలనీలో ప్రతి ఇంటిని నీటిని పంపిణీ చేసేందుకు పైపులైన్ ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా బోరును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ గోపాల్ సింగ్ నాయక్, ఎఈ బాబునాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పులుసు నారాయణరెడ్డి, కేశిరెడ్డి నాగిరెడ్డి, కుర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌సి కాలనీ వాసులు పాల్గొన్నారు.



బోరు బావికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వాటర్ ఎయిడ్ ఇండియా టూల్‌కిట్ వితరణ

విజయపురిసౌత్: మాచర్ల మండలం పశువేముల గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రహ్మానందపురం తండాలో నీటి ట్యాంక్‌కు, నీటి కుళాయిల మరమ్మతుల కోసం వాటర్ ఎయిడ్ ఇండియాకు చెందిన ఐఎస్ మాడెబోయిన గురుప్రసాద్, సీఎఫ్ రవివర్మలు బుధవారం పంచాయతీ సెక్రటరి బాబులాల్ నాయక్, వీఆర్వో పి ప్రశాంతిలకు టూల్‌కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరి మాట్లాడుతూ వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామంలో 15వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును నిర్మించడం జరిగిందన్నారు. ఈ ట్యాంకు ద్వారా 110 కుటుంబాలకు మంచినీటి సౌకర్యం అందుతుందన్నారు. ట్యాంకు నిర్మాణం ద్వారా గ్రామంలో నీటి కొరత తీరుతుందన్నారు. కార్యక్రమంలో వాటర్ ఎయిడ్ ఇండియా ఇంజినీర్ పవన్ కుమార్, మహిళా పోలీస్ లక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గంగాభవానీ, కావేరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పశువేముల పంచాయతీ సెక్రటరి బాబులాల్‌కు టూల్‌కిట్‌ను అందజేస్తున్న వాటర్ ఎయిడ్ ఇండియా సిబ్బంది

అసిస్టెంట్ లైన్‌మెన్ పై దాడి కేసు నమోదు

మాచర్ల: పట్టణంలో రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి తిరునాళ్ల పురస్కరించుకుని పట్టణంలోని విద్యుత్ సరఫరా నిలిపివేసిన అసిస్టెంట్ లైన్‌మెన్‌ పై కొంత మంది దాడి చేశారు. ఈ సంఘటన పై విద్యుత్‌శాఖ ఈఈ జె హరిబాబు, డిఈ రామయ్యలు సిఐ టి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అతని పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉండడంతో నర్సరావుపేట తీసుకెళ్లారు. కుటుంబ వివాదాల నేపథ్యంలో కొందరు యువకులు రైల్వేస్టేషన్‌లో ఘర్షణపడ్డారు. ఆ తరువాత పట్టణ పోలీసు స్టేషన్‌లో తమ పై దాడి చేశారని కొంత మంది యువకులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సెక్షన్ కింద ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గురజాల డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, కారంపూడి సిఐ జయకుమార్, అరుణల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవడం ఎంతో మేలు

మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలను సాగుచేసేముందు భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందని దీంతో వారికి ఆ భూముల్లో సూక్ష్మ పోషకాలపై రైతులకు ఒక అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పంటపొలాల్లో రైతులను ఉద్దేసించి మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్‌లైతే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషీయం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాలలో ఉండేల చూసుకోవడానికి ఈ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడుకోవాలని జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సూక్ష్మపోషకాల లోపాల వల్ల వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచినట్‌లైతే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. సమావేశంలో విఏఏలు, విహెచ్‌ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, గొట్టం లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

24 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

విజయపురిసౌత్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థచే 2023-24 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఏపీ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి బుధవారం తెలిపారు. 5వ తరగతి అలాగే 6,7,8 తరగతుల్లో ఖాళీలకు మే 20వ తేదీన ఆయా జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి కూడా అదే రోజు పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. 12 మైనార్టీ గురుకుల పాఠశాలలు, 3 మైనార్టీ జూనియర్ కళాశాలల్లో ఎటువంటి పరీక్ష లేకుండా మే నెల 15వ తేదీ నుంచి నేరుగా ప్రవేశం కల్పించబడుతుందన్నారు. విద్యార్థులు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్ష విషయంలో సందేహాలు ఉంటే కాలేజీలో గానీ లేదా : 9866318786 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: రంజాన్ మాసంలో మంచి మనసుతో ఏ పని అయినా చేపడితే అది విజయవంతం అవుతుందని, అంత శక్తి అల్లా కల్పిస్తాడని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మర్కస్ మసీదు(పెద మసీదు)లో బుధవారం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ, వైఎస్సార్ సీపీ పార్టీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్‌ల ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీకి కర్జూర పండు తినిపించి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాసుకు ఎండీ గఫార్ కర్జూర పండు తినిపించారు. అనంతరం ముస్లిం సోదరులందరు ఇఫ్తార్ విందును స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మగ్రిబ్ నమాజ్‌ను ఆచరించారు. ఈ సందర్భంగా ఎండీ గఫార్ అధ్యక్షత వహించి ముస్లిం సోదరుల కోసం మసీదు కంప్లెక్స్‌ను రోడ్డు విస్తరణ పోకుండా సహకరించారని, ఈద్గాను అభివృద్ధి చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కొనియాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గత 90 ఏళ్లుగా కాసు కుటుంబం రాజకీయాలు చేస్తూ సేవలు అందించిందే కానీ ఎక్కడా రూపాయి ఆశించింది లేదన్నారు. ఒకరి అభివృద్ధికి తాము అండగా నిలబడతామని తెలిపారు. అలాగే ముస్లీం షాదీఖానాను వచ్చే రెండు నెలల్లో ఏసీ షాదీఖానా ఏర్పాటు చేసి పైన మరో అంతస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే రంజాన్‌మాసంలో నమాజ్ చదువుకునేందుకు వీలుగా మరింతమైన సౌకర్యాలు అవసరమైతే కల్పించేందుకు మరో రెండు రోజుల్లో తానే స్వయంగా పరిశీలించి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. సందర్భంగా ముస్లిం సోదరులందరికి రంజాన్ మాస శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బచ్చేమేస్త్రీ, కౌన్సిలర్లు షేక్ అబ్దుల్లా, షేక్ సైదావలి, ఎస్‌కే సైదావలి, జానిబాబు, అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, ఎండీ అలీం, ఎండీ రషీద్, ఎండీ ఖయ్యూం, ఎండీ రషీద్, ఎండీ సిద్దిక్, ఎండీ బాబర్‌తోపాటు పలువురు ముస్లీం సోదరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు

మాచర్ల: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు జాతీయ స్థాయిలో ఎడ్ల పందేల పోటీలు, తిరునాళ్ళను జయప్రదం చేసిన భక్తులకు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో విశిష్టిత కలిగిన పల్నాడులోని బ్రహ్మోత్సవాలకు అందరూ ఆదరాభిమానాలతో స్వామి వారి ఆశీస్సులు పొంది రథోత్సవాన్ని సైతం విజయోత్సవం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని గుంటూరు రోడ్డులో జరిగిన జాతీయ స్థాయిలో ఎడ్ల పందేల పోటీలను అన్నీ రకాలుగా వేలాది మంది పాల్గొని జయప్రదం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రులు ఆర్‌కె రోజా, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, శాప్ అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పల్నాడు జిల్లా, ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన నాయకులు, ప్రజలకు వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



పిన్నెల్లి రామకృష్ణారెడి
పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు

చలివేంద్రాలు ఏర్పాటు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు బుధవారం ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సూచనల మేరకు నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య నగర పంచాయతీ పరిధిలో ప్రజలు రద్దీగా ఉండే ఐదు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటుచేసి ప్రారంభించారు. వేసవి కాలంలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని చైర్మన్ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, కౌన్సిలర్ నాగుబండి గురువులు, కో ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, నాయకులు కొలా జంపాలరెడ్డి, దేవళ్ల రఘు, కుందురు తిరుపతిరెడ్డి, పల్లె వెంగళరెడ్డి, మునగా శ్రీనివాసరావు, కనమర్లపూడి గోపి, శ్రీరాములు, షేక్ డాడీ, కుంకులగుంట మస్తాన్‌వలి, కొత్వాల్ సైదా పాల్గొన్నారు.



దాచేపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు చొరవతో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, సత్తెనపల్లి కమిటీ సభ్యులు సంయుక్తంగా వంటపాత్రలు, టార్పాలిన్‌పట్టలు, హైజిన్ కిట్స్ బుధవారం అందించారు. బాధితులను పరామర్శించి వారికి అవసరమైన నిత్యావసర సామాగ్రిని అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేర రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా.కంజుల జగన్మోహనరెడ్డి, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తులమురళి, కె.ఎం.యస్.వి.శ్రీనివాసగుప్తా, ఆంజనేయులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డి.కోటేశ్వరరావు, కె.శ్రీరత్నం, ఎస్.భుజంగరావు, సత్తెనపల్లి సబ్‌బ్రాంచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, తహసీల్దార్ భవానీశంకర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి : గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని తంగెడ గ్రామ సమీపంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన ఈ ఘటనలో తెలంగాణలోని నేరేడుచర్లకు చెందిన పోరెడ్డి మాహాపిరెడ్డి(45) మృతిచెందాడు. ఎస్ఐ సంధ్యారాణి కథనం మేరకు నేరేడుచర్లకు చెందిన మహపిరెడ్డి దాచేపల్లి మండలం శ్రీనగర్‌లో నివాసం చేస్తూ జెపి సిమెంట్స్‌లో అపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నేరేడుచర్లలో ఉంటున్న కుమార్తెను తీసుకువచ్చేందుకు మాహపిరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్లుతున్న క్రమంలో ద్విచక్రవాహనం ఢీకొట్టటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతిచెందిన పోరెడ్డి మాహాపిరెడ్డి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com